


# ఆమె క(వ్య)థ

కళింకోట సీతాదేవి

నిలువుటద్దం ముందు నిలబడి, వొయ్యారంగా పైటను సర్దుకుంది సంధ్య. ఎంత చూసినా, సంధ్యకు యింకా యింకా తన అందాన్ని చూసుకోవాలనిపిస్తుంది. పసిమిఛాయలోనున్న శరీరానికి గులాబీ రంగు నైలాన్ చీర, బ్లౌజు సరిగ్గా మాచ్ అయ్యాయి.

ఎంత అందంగా వుంది తను! ఎంతగా

ముద్దొస్తుంది!! గర్వంతో కూడిన దర హాసం సంధ్య పెదవులమీద తొణికిస లాడింది.

ఫౌండేషన్ క్రీమ్‌మీద వేనిషింగ్ క్రీమ్‌ను సుతారంగా రాసుకుని, శాండల్ టాల్కమ్‌ను లైట్‌గా టచ్ చేసింది. 'ఐబ్రో' పెన్సిల్‌తో కనుబొమలను వొంపుగా, అందంగా తీర్చిదిద్దుకుంది. లేత పెదవులకు నాజూకుగా లిప్‌స్టిక్‌ను పూసుకుంది. మరోసారి తన రూపాన్ని తనివితీరా అద్దంలో చూసుకొని, రిస్ట్ వాచీని కట్టుకొని, హైహీల్స్ చెప్పుల్ని తొడుక్కొని, తల్లితో చెప్పి సంధ్య ఆఫీసుకు బయలుదేరింది.

సంధ్య ఒక ప్రయివేటు కంపెనీలో స్టెనోగా పనిచేస్తుంది. అవివాహిత. నాలుగు సంవత్సరాలక్రితం బియ్యే పాసై ఉబుసుపోకకు స్టెనోవుద్యోగంలో జాయినయింది. ఆమెకు యింకా పెళ్ళి కాకపోవడానికి గల కారణం వరుడు దొరకక కాదు. సంధ్య 'ఊఁ' అంటే చాలు ఆమె తల్లిదండ్రులు వరుణ్ని కొనితేగలరు. అయితే, అందుకు సంధ్య అంగీకరించలేదు. కట్నంపోసి మొగుణ్ని కొనుక్కోవడం ఆమె అభిమతానికి పూర్తిగా విరుద్ధం. అయితే, కట్నం లేకుండా పెళ్ళిచేసుకోవడానికి ముందుకు వచ్చే మొనగాడెవడూ లేకపోవడంవలన సంధ్య అవివాహితగా వుండిపోయిందను కోవడం పొరపాటు. సంధ్య కృపా కటాక్షవీక్షణాలకోసం పడిగాపులు కాసే భక్తులెందరో ఆమెకు వున్నారు.

అధికారం, ఆస్తి వున్న వ్యక్తుల చుట్టూ ప్రజలు ఎలా మూగుతారో, అందమైన ఆడపిల్లల చుట్టూ అలాగే సౌందర్యారాధకులు మూగుతారు. సౌందర్యారాధకులలో బోలెడన్ని రకాలు. అందమైన ఆడదానిముందు ఎంత పవరున్న మొనగాడైనా సరే, వాడి కేమాత్రం సౌందర్యాపేక్ష వున్నా గులామైపోతాడు. అధికారంగల వ్యక్తికి ఎక్కడికి వెళ్ళినా తిరుగులేనట్లే, అందగత్తె మాటకుకూడా తిరుగుండదు. ఎంత 'రష్'గా వున్న సిటీబస్సులోనైనా సీటు తక్కువని దొరికిపోతుంది. టాప్ హీరో పిక్చరుకి రిలీజునాడే క్యూలో నిలబడనవసరం లేకుండా టిక్కెట్టు సంపాదించగలదు. ఆమె పిలిచి అడిగితే చాలు, ఆ హీరో అభిమాన సంఘం ప్రెసిడెంటుసైతం నానా హైరానాపడి చొక్కా చింపుకొనైనా సరే ఆమెకోసం టిక్కెట్టు సాధించుకువస్తాడు. ఇంకా ఇటువంటివే చాలా చాలా సౌకర్యాలను అందగత్తె ఒక్క నోటిమాటతో, చిరు నవ్వుతో సాధించగలదు. అందగత్తెకు తన అందమే ఓ పెద్ద ఎస్సెట్.

సంధ్య చెప్పుకోతగ్గ అందగత్తె. కాలేజీలో చదువుకొనేరోజుల్లో జూనియర్ స్టూడెంట్లదగ్గర్నుండి కుర్ర లెక్చరర్లవరకూ ఆమెను సీరియస్‌గా

ప్రేమించారు ఆరాధించారు. కొందరు తను ప్రేమను సంధ్యకు వ్యక్తం చేయడానికి భయపడ్డారు. భయపడనివారు మెత్తని చివాట్లతో, బెదిరింపులతో భంగపడ్డారు.

సంధ్య ఎంత గొప్ప అందగత్తో అంతకుమించిన గర్విష్టి. అహంభావి. తనంతటి అందగత్తె మరొకరు వుండరని ఆమె నమ్మకం. వుంటుందన్న వూహను సైతం ఆమె భరించలేదు. తన అందానికి తగ్గ వ్యక్తి, తనకోసం ప్రాణాల్ని సైతం యివ్వగల ప్రేమికుడు దొరికితేనే గాని వివాహం చేసుకోకూడదని తీర్మానించుకొంది అవతలి వ్యక్తికి తను నచ్చడం అన్నది సమస్యేకాదు. ఆ వ్యక్తి తనకు నచ్చాలి. తన పక్కన నిలబడి నడవగలిగే అర్హతా, అందమూ వుండాలి. అటువంటి వ్యక్తి కోసం గత అయిదు సంవత్సరాల నుండి అన్వేషణ కొనసాగిస్తూవుంది సంధ్య. ఆ అన్వేషణలో ఎదురయిన మొట్టమొదటి వ్యక్తి సంధ్య పనిచేస్తున్న కంపెనీ మేనేజరు. అతడి పేరు పరాంకుశం.

మేనేజరంటే కంపెనీలో పనిచేస్తున్న వాళ్ళకు హడలు. పరాంకుశం చండశాసనుడు. అయిదు నిముషాలు ఎవరైనా ఆలస్యంగా వస్తే చాలు అరగంట చివాట్లు పెడతాడు. చిన్న తప్పుదొరికితే చాలు, నిప్పుతొక్కిన కోతిలాగ చిందులు వేస్తాడు. డిసిప్లిన్ అంటే పడిఛస్తాడు. మనిషి మంచి స్ఫురద్రూపి, నాలుగంకెల జీతం ఎప్పుడూ ఫుల్ సూటులో ఆఫీస్ టైంలో వుంటాడు. కంపెనీ స్టాఫ్‌మీద పెద్దపులిలాగా విరుచుకుపడే మేనేజరు సంధ్యను చూడగానే సాధుజంతువులాగా మారిపోతాడు. అంతవరకూ అతడి కళ్ళల్లో తొంగిచూసే చిరాకు, కోపం మంత్రించినట్టుగా మాయమైపోతాయి.

"గుడ్‌మార్నింగ్ బాస్!" అన్న సంధ్యవైపు పులకించిపోతూ చూస్తాడు. తన ఎదురుగా నున్న కుర్చీలో కూర్చో మన్నట్లుగా మందస్మిత వదనంతో సంజ్ఞ చేస్తాడు. తన ఎదురు సీటును మేనేజరు అకౌంటెంట్‌కు సైతం ఆఫరుచెయ్యడు. మేనేజరు ఎదుట అందరూ చేతులు కట్టుకొని నిల్చోవల్సిందే. అటువంటిది, ఆ సీటులో సంధ్యను కూర్చోమని, తన కోసం తెప్పించుకొన్న బోర్న్‌విటాలో సగం ఆమెకు యిచ్చి, ఆమె వద్దంటే బలవంతంచేసి ఒప్పించి, ఆమె తాగేక, అప్పుడు లెటర్స్ డిక్టేట్ చేస్తాడు.

మేనేజరుకు తనంటే చెప్పలేనంత ప్రేమ అని కంపెనీలో జాయినయిన మొదటి నెలలోనే గ్రహించింది సంధ్య. మంచి పర్సనాలిటీ, మంచి జీతంగల ఈ మేనేజర్ని తానెందుకు వివాహం చేసుకోకూడదని ఆలోచించింది. మేనేజరు రెండు మూడుసార్లు సంధ్యదగ్గర పెళ్ళి ప్రసక్తి నేర్పుగా పట్టుకువచ్చాడు. అయితే, సంధ్య అంతకన్నా నేర్పుగా

అ పెళ్ళి ప్రసక్తి పక్కతోవ పట్టిం చేసింది. ఏ సంగతీ తేల్చి చెప్పలేదు. ఆమె 'సరే' నంటే మూడు ముళ్ళేకాదు. ముప్ఫయి ముళ్ళయినా వేసేయడానికి సంతోషంగా ముందుకు వస్తాడు మేనే జర్. కానీ మేనేజర్ని వివాహం చేసు కునే ఆలోచనను మధ్యలోనే విరమించు కుంది సంధ్య.

అందుకు గల ఒకే ఒక కారణం, మేనేజరుకు తాగుడు అలవాటుండడం. ఆఫీసులో గుమాస్తాలు చాలామంది ఈ విషయాన్ని చెప్పుకోవటం వింది సంధ్య.

సంధ్యకు తాగేవాళ్ళంటే పరమ అసహ్యం. చిన్నప్పుడు సంధ్య వుండే యింటి ప్రక్కన ఒక మెకానికర్ ఫామిలీ వుండేది. ఆ మెకానిక్ రాత్రిళ్ళు చిత్తుగా తాగేసి వచ్చి, భార్యను చితక బాదేవాడు. ఆ తన్నుల్ని భరించలేక భార్య ఒకరోజు కిరసనాయిలు పోసుకుని నిప్పంటించుకు చచ్చిపోయింది. ఆ సంఘటన సంధ్య హృదయంలో బాగా నాటుకుపోయింది. అప్పట్నుంచి తాగు బోతులంటే ఆమెకు భయం, అసహ్యం.

తనకు అన్ని విధాలుగా నచ్చిన మేనేజర్ని 'తాగుబోతు' అనే కారణంతో తిరస్కరించింది సంధ్య.

ఆ తరువాత చాలామంది సంధ్యకు చేరువ కావడానికి ప్రయత్నించారు. అందులో కొందరు ఆమె మనసుకు దగ్గరగా వచ్చేరు కూడా. అయితే, అందరిలోనూ ఏదో ఒక లోపం సంధ్యకు కనిపించింది. దాంతో, వాళ్ళలో తనను పొందే అర్హత ఏ ఒక్కరికీ లేదని తీర్మానించుకుంది.

కాలం ఏ ఒక్కరికోసం ఆగదు. నెలలు, సంవత్సరాలు గడుస్తున్నకొద్దీ తనకు తగిన వరుడు దొరకడేమోనన్న బెంగ పట్టుకుంది సంధ్యకి. తన అపు రూప అందమంతా అడవిగాచిన వెన్నె లేనా అన్న దిగులు ఎక్కువ కాసాగింది వీటికి తోడు, యింట్లో తల్లిదండ్రులు త్వరగా పెళ్ళిచేసు కొమ్మని వొత్తిడి చెయ్యసాగేరు. అర డజను సంబంధాలను తెచ్చేరు. వాటిలో ఒక్క సంబంధమూ, వన్‌పర్సెంట్ కూడా నచ్చలేదు. "ఇటువంటి చెత్త సంబంధాలు మీరు తేనవసరంలేదు. నాకు నచ్చినవాడ్ని నేనే తెచ్చుకుంటాను." అన్నట్లుగా యింట్లో చెప్పేసింది సంధ్య. ఆమె స్వభావము బాగా తెలియడంచేత తల్లిదండ్రులు మారు మాట్లాడలేదు.

సరిగ్గా ఇటువంటి సమయంలో వెదుకబోయిన తీగె కాలికి తగిలినట్లుగా భాస్కర్ ఎదురయ్యాడు సంధ్యకు.

భాస్కర్ సంధ్య పనిచేస్తున్న కంపెనీలోనే కొత్తగా చేరిన సూపర్ వైజర్. చాకులాంటి కుర్రోడు. ఇరవై ఆరు సంవత్సరాలు వుంటాయి. మంచి పర్సనాలిటీ. ఎప్పుడూ నీట్‌గా

వుంటాడు. అతడిది కూడా నాలుగంకెల జీతమే.

భాస్కర్ సంధ్యకు నచ్చేడు.

అతడు తన వైపు మెరిసే కళ్ళతో చూడటం,ఆరాధిస్తున్నట్లుగా మాట్లాడడం, తనతో చనువుగా తిరగాలని తహ తహ లాడడం జాగ్రత్తగా గమనించింది సంధ్య.

గర్వంగా నవ్వుకుంది.

అతడిలో ఎటువంటి చిన్నలోపమూ వుండకూడదని కోరుకుంది. నాలుగైదు సార్లు అతడు యిన్వయిట్ చేస్తే కాదన కుండా బీచ్‌కు, సిన్మాలకు వెళ్ళింది. తామిద్దరినిచూసి ఆఫీసులో వాళ్ళు అసూయ చెందుతుంటే మరింత గర్వంగా నవ్వుకుంది. వీలైనంత తొందరలో తమ పెళ్ళి జరిగిపోతే బాగుండు ననుకుంది సధ్య. ఆ రోజే ఎలాగైనా పెళ్ళి ప్రసక్తి భాస్కర్ దగ్గర తేవాలని నిశ్చయించుకుంది.

ఆఫీసులో సంధ్య అడుగుపెట్టగానే అలవాటుప్రకారం చాలా జతల కళ్ళు ఆమెవైపు తిరిగాయి. సంధ్య సీరియస్‌గా తన సీటులోకి వెళ్ళి కూర్చుని, తెల్ల కాగితం తీసుకుని గబగబా లీవ్ లెటర్ వ్రాసింది.

భాస్కర్ సీటు దగ్గరకు వెళ్ళి, అతడ్నికూడా లీవ్ పెట్టమంది—ఒక్క రోజుకి.

భాస్కర్ ఎందుకని ప్రశ్నించలేదు. ఇద్దరూ ఆఫీసునుండి బైటపడ్డారు.

* * *

ఫైవ్‌స్టార్ హోటల్‌లో కూర్చుని కూల్‌డ్రింక్‌ను సిప్‌చేస్తూ, అసలు విషయంలోనికి వచ్చింది సంధ్య.

"భాస్కర్ ! నామీద మీ అభిప్రాయం ఏమిటి ?" అని సూటిగా ప్రశ్నించింది.

భాస్కర్ ఆశ్చర్యంగా చూశాడు. ఆమె వుద్దేశ్యం అతడికి అవగతం కాలేదు.

"యు అర్ వెరీ వెరీ బ్యూటిఫుల్.." అన్నాడు. అంతకన్నా, ఆ సమయంలో ఏమనాలో అతడికి తోచలేదు.

"ఆ మాట యిదివరకూ చాలామంది నాతో అన్నారు. నేనడిగింది నా అందం గురించి కాదు." అంది సంధ్య.

"మరి?" నొసలు చిట్లించాడు భాస్కర్. ఆమెధోరణి బోధపడలేదు.

సంధ్య కొద్ది క్షణాలు మౌనం వహించింది.

"భాస్కర్ ? నాకు చిన్నప్పట్నుండీ సూటిగా మాట్లాడడం అలవాటు. నేనందగత్తెనని నాకు తెలుసు. మన బాస్‌సైతం నన్ను వివాహం చేసుకోవాలని తహతహలాడేరు. కానీ, నేను లైక్ చెయ్యలేదు. నాకు కావాల్సింది, కేవలం నా అందాన్ని ఆరాధించే వ్యక్తిమాత్రమే కాదు. నేనూ ఆ వ్యక్తిని లైక్‌చెయ్యాలి. అందుకనే,

యిన్నాళ్ళూ వెయిట్ చేసాను. ఇన్నాళ్ళకు, నా నిరీక్షణ ఫలించింది. ఐ లైక్ యు వెరీమచ్ భాస్కర్ ...." అంది కాస్తంత వుద్వేగంతో సంధ్య. తన మాటలకు భాస్కర్ ఎగిరి గంతేస్తాడనీ, ఆనందంతో పొంగిపోతాడనీ ఆశించింది. అయితే, అటువంటి చిహ్నాలేవీ అతడిలో కనిపించలేదు.

అతడు మౌనం వహించడంతో సంధ్య అహం దెబ్బతింది. కనుబొమలు ముడిపడ్డాయి.

"ఏం, నేనంటే యిష్టంలేదా?" అంది పెల్లుబుకుతున్న రోషాన్ని అదుపులో పెట్టుకొంటూ.

"అబ్బే, నేనంత మాటనగలనా ?" అన్నాడు తడబడుతూ.

"మరి ?"

"చూడండి సంధ్యగారూ! ఇలా అంటున్నానని మీరేం కోపం తెచ్చుకోవద్దు.మీది చాలా అపురూప సౌందర్యం. మీకన్నా, కనీసం నేనో ఏడాదన్నా ముందు పుట్టివుంటే యిందాక మీరన్న మాటకు ఎగిరి గంతేసేవాడ్ని. మీకన్నా నేను చిన్నవాడ్ని. మిమ్మల్ని వివాహం చేసుకోవడం లోకందృష్టిలో డెలికేట్ గా వుంటుంది. మా పేరెంట్స్ కూడా అంగీకరించరు." అన్నాడు.

భాస్కర్ మాటలకు సంధ్య తెల్లబోయింది. గొంతు తడారిపోయింది.

"నే....ను....మీకన్నా ఎక్కువ వయస్సున్నదానిలాగ కనిపిస్తున్నానా ?" హీనస్వరంతో ప్రశ్నించింది.

"ఛేకిట్ ఈజీ. మీరు నాకన్నా చిన్నవారిలాగే కనిపిస్తుండవచ్చును. కాని, నిజానికి మీ వయస్సిప్పుడు యిరవై ఎనిమిది." అన్నాడు చిరునవ్వుతో.

సంధ్యకు కళ్ళు పచ్చబడ్డాయి.

ఇంతవరకూ తన అందాన్నిచూసి, పిచ్చిగా ఆరాధించి పెళ్ళిచేసుకోవడానికి పోటీలుపడుతూ వచ్చినవాళ్ళను చూసి, వారిలో లోపాలను వెదుకుతూ కాలాన్ని వెళ్ళబుచ్చింది. అయితే, తనంత అందగత్తెలోకూడా లోపాన్ని వెదికి కాదనగలవాడు వుంటాడని ఏమాత్రం వూహించని సంధ్యకు భాస్కర్ మాటలు ఈటెల్లాగ మనసులో గుచ్చుకున్నాయి.

---